**కథ**

# మనసా ఎటులోర్తునే

**బి.వి.యస్.యస్.లక్ష్మి**

> "సమాజంలో వ్యక్తుల అభిరుచులు, ఆలోచనలు వీటి వైవిధ్యంతో ఒక రకమైన భిన్నత్వం కనిపిస్తుంది. అయినా ఆ వ్యక్తులకు ఉండాల్సిన బంధం, స్నేహమనే కనిపించని ఏకత్వ సూత్రంగా మనుషుల మధ్య ఉండాలి. సంస్కారంగా మనం చెప్పుకునే విషయం ఇతరుల లోపాలని ఎత్తిచూపకుండా సర్దుకుపోతూ జీవించడమే కదా! ఇంట్లో వ్యక్తుల మధ్య, ఇరుగు పొరుగుల మధ్య, భార్యాభర్తల మధ్యనైనా సరే ఈ రాజీతత్వం లేకపోయినప్పుడే గొడవలు తలఎత్తుతూ ఉంటాయి. వీటివల్లనే శాంతి కరువై జీవితం అశాంతిమయమై పోతుంది"

ప్రశాంత జీవన విధానం గురించి ప్రసంగిస్తున్న శాంతి కొలీగ్స్ చప్పట్లతో మాటలు ఆపేసింది.

"అంటే నన్ను మాట్లాడటం ఆపేయమని అర్థం అన్న మాట. ఇంతవరకూ నా మాటలు ఆసక్తిగా విని నన్ను ప్రోత్సహించిన మీ అందరికీ నా ధన్యవాదాలు" చిరునవ్వుతో ముగించి కూర్చుంది శాంతి.

"అంటే ఇవాళ్టికి ఆపి రేపు కొత్తగా వింటామని మా ప్రామిస్ అన్నమాటండీ" కొత్తగా చేరిన తెలుగు మాష్టారు సురేష్ వివరించారు. "అయినా తెలుగు మాష్టారి పేరు సురేష్ ఏమిటండీ ఏ సూర్యనారాయణో, సుబ్బారావో ఉండాలి కానీ" దబాయింపుగా అంది శైలజ మ్యూజిక్ టీచర్.

"మరే! మీ పేరు సుబ్బలక్ష్మి, పట్టమ్మాళ్ కానట్టే" నవ్వుతూనే చురక అంటించాడు సురేష్.

"అయితే రేపు జరగబోయే స్కూల్‌డేకి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లేనా? ఏం శాంతి ప్రసంగం నీదే కదా! ఆహ్వాన ఉపన్యాసం కూడా నీదేకదా? వోట్ ఆఫ్ థాంక్స్ ఎవరు చెపుతున్నారు?" వస్తూనే ప్రశ్నల వర్షం కురిపించారు హెడ్మిస్ట్రెస్ అరుంధతి.

"అవునండీ ప్రసంగం నాదే. వోట్ ఆఫ్ థాంక్స్ నీరజ గారు చెపుతారు. అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి మేడమ్. మీరు ధైర్యంగా ఉండొచ్చు. ప్రోగ్రామ్ అంతా పాల్గొనే వాళ్ళ పేర్లతో సహా ఇందులో రాసి ఉంచాను మేడమ్. మీకూ ఒక కాపీ రాసి పెట్టాను" కాగితాలు ఆవిడకి అందిస్తూ అంది శాంతి.

"థాంక్స్ అమ్మా! మీకు అప్పగిస్తే ప్రశాంతంగా ఉండొచ్చు. ఆ నమ్మకం నాకుంది" అభిమానంగా అంటూ "ఇప్పటికే ఆరయిపోయింది. రెండు రోజులు ఈ హడావిడి అయిపోతే మీకీ ఇబ్బంది ఉండదు" స్వగతంలా అంటూ బయల్దేరదాం...బయటకు నడిచింది అరుంధతి.

"పదండి మనం కూడా బయలుదేరుదాం. మీకేం? మీకు అమ్మలాంటి అత్తగారు ఇంటి దగ్గర. ప్రశాంతి నిలయంలాంటి ఇంటి వాతావరణం. అందరూ అంత అదృష్టవంతులు కారుగా! హాయి హాయిగా ఆమని సాగే" అంటూ కూని రాగాలు తీస్తోంది శైలజ. అందరూ నవ్వుకుంటూ బయలుదేరారు.

శాంతి నడుస్తూ ఆలోచిస్తోంది.. నిజమే! తనకు సాధింపులు, వేధింపులు ఏమీ లేవు. ఇంట్లో అందరూ ఒకరినొకరు అర్థం చేసుకునే వారే! తన భర్త ఆనంద్ కూడా చాలా మంచి వ్యక్తి. తను పెళ్ళికే ఉద్యోగం చేస్తూ ఉంది. పెళ్ళి చూపుల్లోనే ఉద్యోగం చెయ్యడం అనేది తనకి ఎంతో ఇష్టమైనపని అని, మానేసే ఉద్దేశ్యం లేదని స్పష్టంగా చెప్పింది. తనకి అలాంటి అయిష్టత ఏమీ లేదని అతనూ చెప్పాడు. అందరూ చెప్పుకునే మాటలు విని ఏమో అత్తవారింట్లో ఎంతగా తన వ్యక్తిత్వాన్ని చంపుకోవాలో అని ఆలోచించిన శాంతి ఆ ఇంట్లో మనుషుల ఆదరం, అభిమానం చూశాక తానెంతో అదృష్టవంతురాలినని ఆనందించింది. అయినా మనుషులంతా ఒకేలా ఉంటే 'లోకో భిన్న రుచిః' అన్నదెలా నానుడి అయ్యేది అనుకుంది. లారీ హారన్‌తో ఈ లోకంలోకి వచ్చింది. ఇల్లు దగ్గరే కనక నడిచి వస్తుంది శాంతి.

నెమ్మదిగా మెట్లెక్కుతూ తలుపు తీయబోయింది. చేతిలో పుస్తకం జారిపడింది. వంగుని తీసుకుని లేస్తుండగా అత్తగారి గొంతు వినిపించింది. "నాకు ఖాళీ ఉండదు. ఇలాంటివన్నీ నాకెందుకమ్మా?"

"ఫరవాలేదు ఆంటీ. మమ్మల్ని ప్రోత్సహించడానికైనా ఒక కార్డు తీసుకోండి. మీకు నెలకో యాభై రూపాయలు ఖర్చు పెద్ద విషయమేమీ కాదు" అంటోంది సరోజ ఎదురింటి అమ్మాయి.

"అయినా నాకు పనితోనే సరిపోతుందమ్మా! పుస్తకాలు చదివే తీరిక, ఓపిక రెండూ ఉండవు" అంటున్నారావిడ.

మనసులో ఏ మూలో చివుక్కుమనిపించింది. లోపలికి వచ్చింది శాంతి.

"హలో శాంతీ! బావున్నారా?" నవ్వుతూ పలకరించింది సరోజ.

"దామ్మా!" అంటూ రోజూలాగే వంటింట్లోకి నడిచింది అత్తగారు కాఫీ వేడి చేయడానికి.

"నేను తీసుకుంటాను లెండి" కాళ్ళు కడుక్కుంటూ అంది శాంతి.

తను వచ్చే లోపలే కాఫీ తెచ్చి తనకూ, సరోజకూ అందించారు ఆవిడ.

"ఎంత అదృష్టం శాంతీ నీకు ఇలాంటి అత్తగారు దొరకడం"

అది నిజమే అయినా ఏదోలా ఉంది శాంతికి.

కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోయింది సరోజ. స్నానం చేసి జాజిపూలు కోసుకొచ్చి వరండాలో కూర్చుంది శాంతి.

"పూలు నేను మాల కడతానులే. పాలు వచ్చాయి. పొయించుకురా" అన్నారు ఆవిడ.

పాలు పోయించుకుని స్టవ్ వెలిగించింది శాంతి.

"రాత్రికి ఏం చెయ్యమంటారు?" అడిగింది.

"ఇప్పటినించే అక్కర్లేదు. తినే ముందు చేసుకుందాంలే..విశేషాలు చెప్పు"

ఆరోజు స్కూల్లో జరిగిన విశేషాలు శాంతీ, ఇంటి విశేషాలు సుందరమ్మగారూ చెప్పుకుంటూ పనులు చేసుకున్నారు. వంట, భోజనాలు అయ్యాయి. ఇదీ అని చెప్పలేని తేడా ఏదో మనసుకి అనిపిస్తోంది శాంతికి ఏమిటి? అని అడిగితే చెప్పేలా కూడా ఏదీ స్పష్టంగా లేదు. అదే అంది ఆనంద్‌తో. "నువ్వు అన్నీ అవసరం కన్నా ఎక్కువగా ఆలోచిస్తావు శాంతీ. అలా ఏమీ ఉండదు. పడుకో రేపు స్కూల్లో వర్క్ ఎక్కువగా ఉంటుందేమో" అన్నాడు.

పడుకుందే కానీ నిద్రపట్టడం లేదు శాంతికి.

"నాకు ఖాళీ ఉండదమ్మా" అత్తగారి గొంతులోని నిర్లిప్తత చెవుల్లోంచీ పోవడం లేదు. ఒక్క పుస్తకం చదువుకుందికి కూడా ఖాళీ లేకుండా రోజంతా ఏం పని ఉంటుంది. ఒకవేళ ఆ విషయం నిజమే అయితే హాయిగా ఉండాల్సిన ఈ వయసులో ఆవిడ యింకా ఇలా కష్టపడడం న్యాయమేనా? అయినా తను పొద్దుట స్కూల్‌కి వెళ్ళే లోపలే వంట అయిపోతుంది. తరువాత నించీ ఉన్న పనికి తన హెల్ప్ ఉండదు. అలా ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయింది శాంతి.

మర్నాడు లేవడం లేటయ్యింది. అప్పటికే కాఫీలై స్నానం చేసి వంట పనులకి శ్రీకారం చుడుతోంది సుందరమ్మ.

"అయ్యో నన్ను లేపకపోయారా? లేటయిపోయింది" సంజాయిషీలా అంది శాంతి.

"నాకీ పనులన్నీ అలవాటేనమ్మా ఫరవాలేదు. నీ ఒక్క

దానికోసం ఏం చెయ్యాలి" అందావిడ యధాలాపంగా.

మళ్ళీ అదోలాంటి ఫీలింగ్ చుట్టుముట్టింది మనసుని.

తన బాధ్యతల నుంచీ తను తప్పుకుంటున్న ఫీలింగ్. ఆవిడ మామూలుగానే అన్నా తనకీ గిల్టీ కాన్షస్‌నెస్ ఎందుకు? అనుకుంది. స్కూలుకి వెళుతూ చెప్పింది రాత్రి రావడం లేటవుతుంది. కంగారుపడవద్దని.

"నేను ఉన్నాను కదా. చూసుకుంటానులే" అంది ఆవిడ.

ఉలిక్కిపడింది శాంతి.

అంటే..అంటే..ఇలా అన్నింటికీ పెడర్థాలు తీయకు అంటూ మనస్సుని మందలించి స్కూల్‌కి వెళ్ళిపోయింది. రాత్రి ఆలశ్యంగా ఇంటికి వచ్చింది శాంతి. "ఫంక్షన్ బాగా అయిందా?" అడిగారు అత్తగారు, ఆనందు.

"చాలా బాగా అయింది" అంటూ అన్నీ వివరంగా చెప్పింది.

"పడుకో అమ్మా అలసిపోయినట్లున్నావు" అన్నారు సుందరమ్మ.

మర్నాడు "ఆనందూ నేను అన్నయ్య దగ్గరకి వెళతానురా. పిల్లల మీదకి మనసు పోతోంది. మీరిద్దరూ వెళ్ళిపోతే నేను ఒక్కదాన్నే ఉండలేకపోతున్నాను. కొత్తగా పెళ్ళి అయినవాళ్ళు కదా. ఒక పెద్దదిక్కు ఉండడం మంచిదని ఉన్నాను. మళ్ళీ వస్తాను" భోజనాల దగ్గర అందావిడ.

తల్లి అంటే విపరీతమైన ఇష్టం ఆనందుకి. తల్లి అందరు ఆడవాళ్ళలాంటిదీ కాదని అతడి నమ్మకం.

"అమ్మా నువ్వు వెళ్ళిపోతే చిన్నబోయినట్టుంటుంది ఇల్లు. ఇంకొన్నాళ్ళయ్యాక వెళుదువుగానిలే" తల్లిమాట కాదన్నట్లుగా అన్నాడు ఆనందు.

"అలా కాదులేరా! మళ్ళీ వస్తాను. నేనెక్కడికి పోతాను నా పిల్లలని వదిలి" కళ్ళలో నీళ్ళు తిరిగాయి సుందరమ్మకి.

భర్త గుర్తుకు వచ్చి ఈ బరువులు, బాధ్యతలు తనవేనని నిర్ణయించి భగవంతుడు ఆయన్ని దూరంచేశాడు. ఈ జీవితం ఎలా గడుస్తుందో ఏమో నిట్టూర్చింది.

తల్లి ఆలోచనలు గ్రహించి, "సరే అయితే, నేను రెండు రోజులు శెలవుపెట్టి నిన్ను దింపుతాను. శాంతీ నువ్వు కూడా శెలవు పెట్టగలవా?" అడిగాడు.

"నా శెలవంతా పెళ్ళికి అయిపోయింది. అయినా అడిగి చూస్తాను" అంది శాంతి.

"పోన్లే నన్ను బస్సు ఎక్కించెయ్యి. ఆ అమ్మాయిని ఇబ్బంది పెట్టకు. ఉద్యోగస్థుల బాధలు తెలియనివా ఏమిటి?" అక్కడినించీ వెళిపోతూ అంది సుందరమ్మగారు.


మనసు చిన్నబోయింది శాంతికి. అంతలోనే సర్దుకుంది. ఆవిడ ఏం తప్పుమాట అన్నారు గనక. తనెందుకు గిల్టీగా ఫీలవడం అనుకుంది.

"ఉండండి అత్తయ్యగారూ..పెద్దవాళ్ళు మీరు ఉంటేనే బాగుంటుంది" అంది శాంతి.

శాంతిని చూస్తూ నవ్వుతూ తల అడ్డంగా ఆడించింది సుందరమ్మ.

"నేను ఇక్కడే ఉండాలంటే నీ ప్రయత్నాలు నువ్వు చెయ్యాలి శాంతీ" అంది. భావం అర్థమై సిగ్గుతో తల దించుకుంది.

ఆవిడ ప్రయాణం ఖాయం అయింది. స్కూల్లో శెలవు దొరక లేదు శాంతికి.



ఆనందు వెళ్ళి దిగబెట్టి వచ్చాడు. వదిన చాలా మంచిది. అన్నయ్యకి పెళ్ళి అయి ఇన్ని సంవత్సరాలయినా ఆవిడ మీద కంప్లైంట్స్ లేవు. ఆవిడ ఎప్పుడూ పిల్లలకీ, పెద్దలకీ కూడా అందుబాటులో ఉంటుంది. ఇదీ అన్నసంసారం మీద ఆనందు అభిప్రాయం.

వచ్చిన ఆనందుని "బావగారూ; అక్కా పిల్లలూ బాగు న్నారా?" అడిగింది "ఊ. చాలా.."

నాలుగు రోజులు ఇల్లు చిన్నబోయినట్లయింది శాంతికి. ఆ రోజుల్లోనే ఆఫీసులో ఎక్కువ పని ఉంది. రాత్రి పదింటికి గానీ ఇల్లు చేరలేదు ఆనందు. స్కూల్‌నించీ ఆరు గంటలకి వచ్చినా రెండు గంటలు రెస్ట్ తీసుకున్నా వంట, పని సులభంగానే అయిపోయాయి శాంతికి. గ్యాస్‌స్టవ్, కుక్కర్, మిక్సీ వచ్చాక వంట పెద్ద పని కాకుండా పోయింది. ఇలా ఆలోచిస్తున్న శాంతికి మళ్ళీ "నాకు టైముండదు" అన్న అత్తగారి మాటలు జ్ఞాపకం వచ్చి కొంత బాధపెట్టాయి మనసుని. అత్తాకోడళ్ళ మధ్య సాధారణంగా మూడో మనిషి మాటలు కలతలు రేపుతాయని ఎప్పుడూ అనుకునే శాంతి తనలోనే ఉన్న మూడో మనిషిని అదిలించలేకపోతోంది. ఆనందుతో అంటే బాగుండదు. అతని తల్లి మీద చాడీలు చెప్పినట్లు ఉంటుంది. ఇంతకీ ఆవిడ తననేమీ సాధించలేదు. లేదా సరోజతో ఆ కార్డు తీసుకోవడం ఇష్టంలేక యధాలాపంగా అన్నారేమో! అని సరిపెట్టుకుంది మనసుకి.

ఆనందుకి చిన్నపిల్లాడిలా తీసిన వస్తువులు చేతి కందిన చోటల్లా పెట్టేస్తూ ఉండటం అలవాటు.

నాలుగు రోజులయ్యాక మొదలైంది అసలు సంగతి.

"శాంతీ నా టవలేదీ? నా షేవింగ్ సెట్ ఎక్కడ? ఇలా అయితే ఎలాగ? నాక్కావలసినవి వెంటనే కన పడకపోతే ఎలా?" విసుక్కున్నాడు.

నిన్న స్కూల్లో పేపర్లు దిద్ది వచ్చి అలసటగా ఉండి ఇల్లు ఏమీ సర్దలేకపోయింది. ఒక్కరోజుకి తను చూసుకోవచ్చుగా విసుక్కోకపోతే..అదోలా అనిపించింది శాంతికి. వంట చేసుకుంటూనే వచ్చి వెతికి ఇచ్చింది.

"తీసినవి తీసిన చోటే పెడితే వెతుక్కునే అవసరం రాదు కదా" అంటున్న శాంతివైపు కోపంగా చూశాడు ఆనందు.

"అయినా ఇలాంటివన్నీ చిన్నప్పుడే నేర్పాలి పెద్ద వాళ్ళు. లేకపోతే ఇదుగో..ఇలాగే" శాంతి నవ్వుతూనే అంటున్నా చాలా కోపం వచ్చింది ఆనందుకి.

"అవును మరి. ఇద్దరం వెళ్ళిపోయాక ఇవన్నీ చూసి బట్టలుతికి అన్నీ రెడీ చేసి పెట్టేది అమ్మ. చిన్నప్పుడే ఇవన్నీ నేర్పేంత తీరికగా పెంచలేదు. ఎందుకంటే ఇప్పుడు ఉన్నన్ని సౌకర్యాలు అప్పుడు లేవు. కుటుంబం కూడా చాలా పెద్దది. అందరికీ అన్నీ అమర్చేసరికే అమ్మకి సరిపోయేది" అభిమానంగా అన్నాడు ఆనందు.

"అమ్మో..ఎంత కోపం వచ్చిందో నేను అత్తయ్యగారినేం అనలేదు. మిమ్మల్నే అంటున్నాను. ఇలా అందరిమీద ఆధారపడకపోతే మీ పనులు.." ఆనందుని చూసి ఆగిపోయింది శాంతి.

"ఇది మనుష్యులకి ముఖ్యంగా తల్లీ బిడ్డలకీ, భార్యాభర్తలకీ, పిల్లలకీ మధ్య ఉండే కన్‌సర్న్. నీకోసం నేను అనే భావన. అంతే తప్ప నేను చేసుకోలేనివి కావు. బాంధవ్యాల మధ్య గాఢత పెంచేది ఇటువంటి అభిమానాలే. నువ్వు లేటయితే నీకూ కాఫీ, టిఫిన్ చేసి నేను ఉంచుతాను. డ్యూటీగా కాదు అభిమానంగా"

"ఆపండి బాబూ అర్థం అయింది. మీకింత కోపం వస్తుందని తెలియక అన్నాను. సీరియస్ అయిపోకండి" చేతులు జోడిస్తూ అంది.

"సీరియస్ కాదు శాంతీ. ఇలాంటి చిన్న విషయాలే అభిప్రాయభేదాలకి కారణం అవుతూ ఉంటాయి. నువ్వన్న ఈ మాట అమ్మ విని ఉంటే ఎంతో బాధపడేది కదా! వాళ్ళ అనుభవం అంత లేదు మన వయసు. వాళ్ళలో తప్పులు వెదికే బదులు..అయినా మనుషుల్ని బట్టి కూడా ఉంటుందనుకో. అమ్మ అందరిలాంటిదీ కాదు. అక్కర్లేని విషయాలకి ప్రాధాన్యత నిచ్చి జీవితంలో శాంతినీ, సుఖాన్నీ పాడు చేసుకోకు" నిష్ఠూరంగా అన్నాడు ఆనందు.

"సారీ! నేనన్న ఒక్క మాట మిమ్మల్ని ఇలా, ఇంతగా బాధపెడుతుందని తెలుసుంటే అనకపోదును. వెరీ సారీ" అంటూ నెమ్మదిగా వరండాలోకి వెళ్ళిపోయింది శాంతి.

సరదాగా తాను అన్న ఆ మాటకి ఆనందు ఎందుకంతగా రియాక్ట్ అయ్యాడు, అంత కానిమాట తనేం అంది. ఆలోచిస్తూ ఉండగా తనకే సమాధానం తోచింది శాంతికి.

చిన్నతనంలోనే తండ్రి పోవడంతో తల్లీ, తండ్రీ తానే అయి పెంచారావిడ. ఇద్దరి ప్రేమ ఆవిడ దగ్గరే పొందడంతో పిల్లలకి ఆవిడ పట్ల అభిమానం, ప్రేమ చాలా ఎక్కువ. ఆవిడని తనేదో అన్నానని అనుకుని ఫీలయ్యారు అనుకుంది. లోపలికి వచ్చిన శాంతిని చూసి, ముభావంగా కళ్ళు దించుకుని చేతిలోని పేపరు చూస్తున్నాడు ఆనందు. అలిగిన చిన్న పిల్లాళ్ళా కనపడ్డాడు శాంతికి. ఈ మూడ్ మార్చాల్సింది కూడా తనే కదా. ఒకరికి ఒకరం, ఒకరికోసం ఒకళ్ళం అని ప్రమాణాలు చేసుకుని పెళ్లి చేసుకున్న తాము చిన్న చిన్న విషయాల కోసం పంతాలకు పోయి హాయిగా ఉండే సంసారాన్ని పాడు చేసుకోకూడదు అనుకుంది.

సాయంత్రం అన్నీ ఆనందుకి ఇష్టమైన పదార్థాలు చేసింది. ఇద్దరూ మౌనంగానే భోజనాలు చేశారు.

"అన్నీ నాకిష్టమైనవే చేశావు"

"ఔను నాకు మీకు యిష్టమైనవి చేసిపెట్టడమే ఇష్టం" అంది నవ్వుతూ.

"థాంక్స్ శాంతీ! నీ తత్వం నాకు నచ్చింది. పొద్దున్న జరిగిన విషయం ఎంత పెద్ద గొడవకైనా దారి తీయొచ్చు. ఇద్దరం మనసులు పాడు చేసుకుని బాధ పడవచ్చు. కానీ నీ పరిష్కారం నాకు నచ్చింది" శాంతి చేయి పట్టుకుని స్నేహపూర్వకంగా అన్నాడు.

"మరి నన్ను గురించి నువ్వేమనుకున్నావు" ఆత్రుతగా అన్నాడు.

"నిజం చెప్పనా? ఇంత కోపం ఉందనుకోలేదు. అయితే అంత కోపం వచ్చిన కారణం కూడా తెలుసు. మీ అమ్మగారి మీద మీకున్న ప్రేమ అర్థం అయింది. అప్పుడు అనుకున్నానూ 'మనసా ఎటు లోర్తునే' అని" రాగయుక్తంగా పాడుతూ ఆనందుని ఆటపట్టించింది శాంతి.

★

## 'కల'వరం

**కొంతమంది హీరోయిన్స్ పేర్లు వింటే వారి పాత్రలు మన కళ్లముందు మెదులుతాయి. అల్లరి పిల్ల అంకిత తన ఆకాంక్షల్ని వెల్లడిచేస్తోంది. అవి ఎప్పటికైనా నెరవేరితే బాగుంటుందంటోంది. ఎప్పటికైనా ద్విపాత్రాభినయం చేయాలని కలలుకంటున్న అంకిత ఆ కల సాకారం కోసం ప్రయత్నాలు చేస్తోంది. బ్లాక్‌బస్టర్ 'సింహాద్రి'లో ఆమె నటనకి మంచి మార్కులే పడ్డాయి. 'ప్రేమలో పావనీ కళ్యాణ్' చిత్రంలో కూడా ఆమె నటించింది. ప్రస్తుతం శివాజీతో కలిసి ఆమె సీతారాముడు చిత్రంలో నటిస్తోంది.**

